క్లుప్తంగా

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



క్రీడా పోటీలను పరిశీలిస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు

రాజమహేంద్రవరం సిటీ: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని కందుకూరి వీరేశలింగం పుర మందిరం (టౌన్ హాల్) జూబ్లీ పబ్లిక్ లైబ్రరీ సెక్రటరీ, వైఎస్సార్ సీపీ నాయకుడు, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆకుల వీర్రాజు పిలుపు నిచ్చారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం ముగింపు సందర్భంగా బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో టౌన్ హాల్ సభ్యులు నల్లం శ్రీనివాస్, రెడ్డి రాజు, కె.సత్యనారాయణ, లైబ్రేరియన్ వీటీవీ సుబ్బారావు, ఎస్వీ రమణ, కె.కమల్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో శుభ్రతకు ప్రాధాన్యం



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: మధ్యాహ్న భోజనం పథకంలో ఆహారం వండేటప్పుడు శుభ్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బొమ్మూరులోని జీపీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ వంటగది, విద్యార్థులు భోజనం చేసే ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. వేడి ఆహార పదార్థాలనే వడ్డించాలని ఆదేశించారు. ఆమె వెంట జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తదితరులు ఉన్నారు.

పారిశుధ్య మెరుగుకు సహకరించాలి



వేమగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో రమేష్ తదితరులు

కడియం: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో కె.రమేష్ కోరారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వేమగిరిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు పారిశుధ్యం, మరుగుదొడ్లపై అవగాహన కల్పించారు. చేతుల పరిశుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో పోలీస్ ఇన్స్పెక్టర్ అల్లు వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పీవీ సుబ్బారావు, షీలా రాణి, విద్యార్థులు, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: కంగువా
సూర్యమినీ	: గ్లాడియేటర్–2
సూర్యప్యాలెస్	: కంగువా
శివజ్యోతి	: మట్కా
అనుశ్రీ	: క
స్వామి	: అమరన్
అశోక	: లక్కీభాస్కర్
రాజా	: మట్కా
రంభ	: సి 202
ఊర్వశి	: కంగువా
మేనక	: జితేందర్‌రెడ్డి,గ్లాడియేటర్–2
కుమారి	: గ్లాడియేటర్–2
అప్సర	: మట్కా
నామవరం	
వివిఎస్.మహల్	: కంగువా
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: మట్కా
కడియం	
వెంకటసూర్య	: కంగువా

వెచ్చని నేస్తాలు



కోటిపల్లి బస్టాండ్ వద్ద ఉన్ని దుస్తులను విక్రయిస్తున్న టిబెటియన్లు



హెడ్ పోస్టాఫీస్ సమీపంలో మధ్యప్రదేశ్ వ్యాపారుల దుకాణాలు

- పెరిగిన చలి తీవ్రత
- స్వెట్టర్లకు డిమాండ్
- రాజమహేంద్రవరంలో వెలసిన దుకాణాలు
- ఆకట్టుకుంటున్న ఉన్ని దుస్తులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వాతావరణంలో క్రమేపీ మార్పులు వచ్చాయి. నిన్నటి వరకూ గుబులు పుట్టించిన ఎండలు తగ్గిపోయాయి. ప్రస్తుతం చలి ఊపందుకుంది. రెండు, మూడు రోజులుగా దీని తీవ్రత బాగా ఎక్కువైంది. ఈ నేపథ్యంలో చలి తీవ్రతను తగ్గించే ఉన్ని దుస్తులు మార్కెట్‌లోకి వచ్చేశాయి. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రతి ఒక్కరూ ఉత్సాహం చూపిస్తున్నారు. దీంతో ఉన్ని దుస్తులకు గిరాకీ బాగా పెరిగింది. రాజమహేంద్రవరం నగరంతో పాటు, పరిసర ప్రాంతాల్లో ఉన్ని స్వెట్టర్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. టిబెట్, నేపాల్, రాజస్థాన్, హిమాచలప్రదేశ్, మధ్యప్రదేశ్ ప్రాంతానికి చెందిన వ్యాపారులు ఏటా మాదిరిగానే ఈసారి కూడా దుకాణాలను ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. అయితే వీరితో పాటు స్థానికులు సైతం ఉన్ని దుస్తుల విక్రయాలు జరుపుతున్నారు.

జీవనోపాధి కోసం..

టిబెటియన్లు 44 ఏళ్లుగా కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని ఉన్ని దుస్తుల దుకాణాలను ఏర్పాటు చేసుకుని వ్యాపారం కొనసాగిస్తున్నారు. వీరితో పాటు నేపాల్, హిమాచలప్రదేశ్‌కు చెందిన వ్యాపారులు కూడా దుకాణాలను ఏర్పాటు చేశారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌కు చెందిన వారు మాత్రం నగరంలో వివిధ చోట్ల రోడ్ల పక్కనే దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. వీరందరూ ఎంతో కాలం నుంచి ఇక్కడకు వచ్చి వ్యాపారాలు చేస్తుండడంతో వారికి స్థానికులు కూడా ఇళ్లను అద్దెకు ఇస్తుంటారు. వాటిలో ఉన్ని దుస్తులు దాచుకుని మళ్లీ సీజన్‌లో ఇక్కడకు వచ్చి కార్యకలాపాలు కొనసాగిస్తారు. మిగిలిన ఎనిమిది నెలలు తమ స్వస్థలానికి వెళ్లిపోతారు.



రకరకాల దుస్తులు

చలి నుంచి కాపాడుకోవడానికి పలు రకాల స్వెట్టర్లు, రగ్గులు దుకాణాల్లో అందుబాటులో ఉన్నాయి. స్వెట్టర్లు, మఫ్లర్లు, బ్యాంకెట్లు, రెయిన్ కోట్లు, మంకీ క్యాప్‌లు, గ్లౌజ్‌లు, జర్కిన్లు, గరం కోట్లు.. ఇలా పలు రకాల ఉన్ని దుస్తులు, వస్త్రాలను వీరు విక్రయిస్తున్నారు. యంత్రాలతో చేసిన స్వెట్టర్ల ధర కన్నా చేతితో అల్లిన స్వెట్టర్లు ఎక్కువ వెచ్చదనాన్ని ఇస్తాయి. వీటిని తయారు చేసేందుకు ఎక్కువగా శ్రమ పడాలి. దానికి అనుగుణంగానే ధర కూడా కాస్త ఎక్కువగానే ఉంటుంది. పంజాబ్, లూధియానా, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి ఉన్ని దుస్తులను కొనుగోలు చేసి తీసుకువచ్చి విక్రయాలు జరుపుతుంటారు. మోడళ్లను బట్టి స్వెట్టర్లు, బ్యాంకెట్లు, రగ్గులులను వివిధ ధరలకు విక్రయిస్తున్నారు.



అమ్మకానికి సిద్ధం చేసిన ఉన్ని దుస్తులు



నాణ్యతకు ప్రాధాన్యం



మా దగ్గర ఉన్ని దుస్తులు నాణ్యతతో ఉంటాయి. రాజమహేంద్రవరంలో 20 ఏళ్లుగా విక్రయాలు జరుపుతున్నాం. ప్రజలు కూడా నమ్మకంతో ఆదరిస్తుండడంతో ఏటా ఇక్కడకు వస్తున్నాం. ఈ ఏడాది కూడా అందుబాటు ధరలతో పాటు నాణ్యమైన స్వెట్టర్లు అందుబాటులో ఉన్నాయి. చేతిలో అల్లిన దుస్తులను సైతం విక్రయిస్తున్నాం.

– వినోద్ కౌశల్, టిబెట్ వ్యాపారి

18 ఏళ్లుగా వస్తున్నాం



ఏటా అక్టోబరులో ఇక్కడకు వచ్చి ఫిబ్రవరి చివరి వరకూ వ్యాపారాలు కొనసాగిస్తాం. మా వద్ద రగ్గులు, ఉన్ని దుస్తులు, వివిధ మోడళ్ల స్వెట్టర్లు అందుబాటులో ఉన్నాయి. రాజమహేంద్రవరంలో విక్రయాలు బాగా జరుగుతున్నాయి. గత 18 ఏళ్లుగా ప్రజలు మాపై నమ్మకంతో దుస్తులను కొనుగోలు చేస్తున్నారు.

– తేజాలాల్, వ్యాపారి, మధ్యప్రదేశ్

ప్రభుత్వ పాఠశాలలకు అపార నష్టం

కంబాలచెరువు: ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అసంబద్ధంగా ఉందని, దాన్ని వెంటనే సరిచేయకపోతే ప్రభుత్వ పాఠశాలలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ అన్నారు. గతంలో ఒక పాఠశాలకు అక్కడ ఒక ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడున్నా.. అవసరాన్ని బట్టి వేరే పాఠశాల నుంచి మరో ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేశారన్నారు. ఇప్పుడు ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో ఒక ఉపాధ్యాయుడిని వేరే స్కూల్‌కు పంపించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి సందర్భంలో కొత్త ఉపాధ్యాయుడిని కాకుండా పాత ఉపాధ్యాయుడిని పంపిస్తున్నారని ఆరోపించారు. అలాగే స్కూల్ అసిస్టెంట్ సబ్జెక్టు టీచర్ లేకపోతే వేరొక పాఠశాల నుంచి అర్హతలు ఉన్న ఎస్‌జీటీ టీచర్‌ను సర్దుబాటు చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు వెంటనే ఇలాంటి విషయాలపై దృష్టి సారించాలని కోరారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాల విజయవంతానికి కృషి

కంబాలచెరువు: యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులందరూ సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర కార్యదర్శి ఎస్.అరుణ కుమారి పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలోని యూటీఎఫ్ హోమ్‌లో మంగళవారం జిల్లా యూటీఎఫ్ స్వర్ణోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం పాఠశాల పని వేళలు ఒక గంట పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. నియమిత పని గంటలు మించి విద్యార్థులకు బోధన సాగిస్తే పిల్లలు ఒత్తిడికి గురయ్యే ప్రమాదముందన్నారు. అధికారులు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ కాకినాడలో జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అసోసియేట్ విజయ్ గౌరీ, జిల్లా కార్యదర్శులు శ్రీమణి, రమేష్, ప్రకాష్, ఎం.భాస్కర్, దయానిధి, నర్సారెడ్డి నాగభూషణం, రాష్ట్ర నాయకులు రూపస్ రావు, రాజేశ్వరి, చిలుకూరి శ్రీనివాస రావు, రాష్ట్ర పరిశీలకులు జి.రమణ పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపేయాలి

ధవళేశ్వరం: నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే ఆపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నగర కమిటీ సభ్యుడు కర్రి రామకృష్ణ డిమాండ్ చేశారు. ధవళేశ్వరం సీఐటీయూ కార్యాలయంలో కె.రంగారావు అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముందుగా పలు జిల్లాలలో ప్రభుత్వ కార్యాలయాలకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించారన్నారు. ప్రస్తుతం చిన్న, మధ్య తరగతి వ్యాపార సంస్థలతో సహా అందరికీ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారన్నారు. ఇప్పుడు విద్యుత్ వినియోగదారుల అనుమతి లేకుండా నివాస గృహాలకు మీటర్లు బిగించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో ఎక్కడ స్మార్ట్ మీటర్లు బిగించినా ప్రజలందరూ ప్రతిఘటించాలని సూచించారు.

గత ప్రభుత్వం పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయని గుర్తు చేశారు. నాడు మీటర్లు పగలగొట్టాలని పిలుపునిచ్చినవారే నేడు మీటర్లు బిగిస్తుండడం ప్రజలను మోసం చేయడమే అవుతుందని ధ్వజమెత్తారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలందరిపై భారం పెరుగుతుందని, ముందుగానే డబ్బు చెల్లించి రీచార్జి చేయించుకోవాలన్నారు. మరోవైపు ప్రతి మీటర్‌కు అయ్యే ఖర్చును 96 నెలల పాటు వాయిదాల పద్ధతిలో వినియోగదారుల నుంచే వసూలు చేస్తారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగి తెలుగుదేశం, జనసేన పార్టీలు ఈ మీటర్లను కొనసాగించడం దుర్మార్గమన్నారు. సమావేశంలో ఎస్.దుర్గాప్రసాద్, సీహెచ్ రామకృష్ణ, ఆర్.రామకృష్ణ, డి.నారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి అరుణ్

క్రమశిక్షణతో విద్యాబోధన చేయాలి

కంబాలచెరువు: క్రమశిక్షణ కలిగిన భావి భారత పౌరులను తయారు చేయాలని ఉపాధ్యాయులకు బీఈడీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డి.బూరయ్య సూచించారు. స్థానిక కంటిపూడి రామారావు మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశానికి మంగళవారం ఆయన ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులపై అనేక ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, సమర్థవంతంగా పనిచేయాలన్నారు. బోధనలో ఆధునిక టెక్నాలజీపై అవగాహన చేసుకోవాలన్నారు. అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయులు వినియోగించుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో చేస్తున్న వినూత్న కార్యక్రమాలను, విద్యా ప్రవేశ్ కృత్యాలను సమీక్షించారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఒకటో తరగతి విద్యార్థులకు నిర్వహించిన విద్యాప్రవేశ్ కృత్యాలను భద్రపరచాలన్నారు. కాంప్లెక్స్ చైర్మన్ పులుగుర్త దుర్గాప్రసాద్, రిసోర్స్ పెర్సన్ మోటూరి మంగారాణి, సీఆర్పీ పబ్బినీడి ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత ప్రిన్సిపాల్ బూరయ్య

ప్రముఖుల జీవితాలు స్ఫూర్తిదాయకం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రముఖుల జీవితాలను విద్యార్థులు స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మాటూరి మంగతాయారు, ఇండియన్ రెడ్‌క్రాస్ సభ్యురాలు ఎ.మహాలక్ష్మి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ జయంతి నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు హ్యాండ్ క్రాఫ్ట్, వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు జరిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీదేవి, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

అల్కాట్‌తోట శాఖా గ్రంథాలయంలో..

అల్కాట్‌తోట శాఖాగ్రంథాలయంలో ఇందిరా గాంధీ జయంతి, విద్యార్థులకు దేశభక్తి, జానపద గీతాల పోటీలను నిర్వహించారు. వీటికి రైల్వే విశ్రాంత ఉద్యోగి కె.సత్యనారాయణ, ఎస్‌ఆర్‌ఎంసీ హెచ్ స్కూల్ టీచర్ నిర్మల న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. గ్రంథాలయాధికారి కొత్తపల్లి రమ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సీటీఆర్‌ఐ: గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయంలో ఇందిరా గాంధీ జయంత్యుత్సవం నిర్వహించారు. అనంతరం భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ×గురు వందన్ ఛాత్ర అభినందన్ణ కార్యక్రమంలో భాగంఆ గురువులకు సన్మానం, విద్యార్థులకు అభినందన కార్యక్రమం జరిపారు. అల్లు రామకృష్ణ సేకరించిన పురాతన నాణేలు, నోట్లు, పోస్టల్ స్టాంపుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. వీటిని విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జి.శ్రీదేవి, పీఎస్ కృష్ణారావు, బి.రత్నాంబ, డాక్టర్ అరిపిరాల నారాయణరావు పాల్గొన్నారు.

కడియం: మహిళల్లో మణిహారం ఝాన్సీలక్ష్మీబాయి అని కడియం సబ్ రిజిస్ట్రార్ లక్ష్మి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశిష్ట సేవలందించిన మహిళల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. ఏఎన్ఎం సునీత మాట్లాడుతూ బాల్యం నుంచీ కూడా సేవాగుణం అలవర్చుకోవాలన్నారు. శాఖా గ్రంథాలయ అధికారి శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సభ్యులు చిలుకూరి వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో మాట్లాడుతున్న మంగతాయారు



అల్కాట్‌తోటలో దేశభక్తి గీతాల పోటీలో పాల్గొన్న విద్యార్థులు



గురువులకు సత్కారం కార్యక్రమంలో పాల్గొన్న గ్రంథాలయ అధికారి శ్రీదేవి తదితరులు



కడియం గ్రంథాలయ వారోత్సవాల్లో మాట్లాడుతున్న సబ్‌రిజిస్ట్రార్ లక్ష్మి

జనవరి 5న హైందవ శంఖారావం

రాజానగరం: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావం భారీ బహిరంగ సభకు హిందువులందరూ తరలిరావాలని మండల కన్వీనర్ గ్రంధి గణేష్, కో కన్వీనర్ జి. శ్రీనివాస్‌లు విజ్ఞప్తి చేశారు. రిమ్మలపూడి సుబ్బరాజు అధ్యక్షతన దివాన్ చెరువులోని ధరణి గోదావరి విద్యా పీఠంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దేవాలయాల పరిరక్షణ కోసం ప్రతి హిందువు ముందడుగు వేయాలన్నారు. అనంతరం హైందవ శంఖారావం పోస్టర్‌ను తిక్కన వీర వెంకట్రావు ఆవిష్కరించారు.

మహిళా సాధికారతపై అవగాహన



సీతానగరం గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

సీతానగరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సీతానగరం గ్రంథాలయంలో దిశ చట్టం, మహిళా సాధికారతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ టి.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పుస్తక నిక్షిప్త కేంద్రం నిర్వాహకురాలు బి.అరుణ మాట్లాడుతూ శతాబ్దాలుగా దేశంలో మహిళల పాత్ర అనేక గొప్ప మార్పులకు లోనవుతూ వచ్చిందన్నారు. ఆధునిక భారతదేశంలో మహిళలు రాష్ట్రపతి, ప్రధానమంత్రి, లోక్‌సభ, ప్రతిపక్ష నాయకురాలు వంటి అత్యున్నత పదవులను అలంకరించారన్నారు. అలాగే దిశ చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. కార్యక్రమంలో మహిళా శక్తి సంఘం మహిళలు ఎం.శిరీష, ఎం.గనిరత్నం, ఎస్.ముత్యాలు, ఎం.చంటమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

రాజానగరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం దివంగత ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ సత్యనారాయణ, సీహెచ్ పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్‌ఐ ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలి

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరంలోని ఈఎస్‌ఐ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని, వంద పడకల ఆసుపత్రికి తగ్గట్టుగా సిబ్బందిని పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. సీపీఐ, రాజమండ్రి జట్ల లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం సీతంపేట ఈఎస్‌ఐ ఆసుపత్రిలో కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ధర్నా చేశారు. ఆసుపత్రిలో అవినీతిని అరికట్టాలని, వైద్యులు అందుబాటులో ఉండాలని నినాదాలు చేశారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ కార్మికుల సొమ్ముతో ఏర్పడిన ఈఎస్‌ఐ ఆసుపత్రి అవినీతి తార్కాణంగా మారడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ వంద పడకల ఆసుపత్రికి 300 మంది సిబ్బంది ఉండాలని, కానీ ఇక్కడ 35 మంది మాత్రమే ఉన్నారన్నారు. ఎంపీ పురందేశ్వరి ఈ అంశంపై కేంద్రంతో మాట్లాడాలని కోరారు. ధర్నాలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల నిర్వాహకులపై చర్యలు

మధురపూడి: సంక్రాంతి సందర్భంగా కోడి పందేల నిర్వహణకు అనుమతులు లేవని, నిబంధనలు ఉల్లంఘించి నిర్వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని కోరుకొండ సీఐ వై.సత్య కిషోర్ అన్నారు. కోరుకొండలోని సీఐ కార్యాలయంలో కోరుకొండ, సీతానగరం, గోకవరం ఎస్సైలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహించినా, కత్తులు తయారు చేసినా, పందేలకు స్థలాలను సిద్ధం చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. పేకాట, గుండాట, సారా తయారీ దారులపై ఉక్కుపాదం మోపామన్నారు. గంజాయి రవాణా, మహిళలపై దాడులు, అత్యాచారాలను అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. మహిళలు, ప్రముఖులను కించపరుస్తూ సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెట్టిన వారిపై చర్యలుంటాయన్నారు. సమావేశంలో ఎస్సైలు శ్యామ్ సుందర్, పవన్ కుమార్, రామ్ కుమార్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ల డైరెక్టర్ల నియామకం



నారాయణ గౌడ్



మద్దా మణి

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన నాలుగు రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లలో నియోజకవర్గానికి చెందిన ఇద్దరికి చోటు దక్కింది. కోలమూరుకు చెందిన జనసేన జిల్లా అధికార ప్రతినిధి యామన నారాయణ గౌడ్ రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. కాతేరు గ్రామానికి చెందిన టీడీపీ మహిళా నాయకురాలు మద్దా మణికి రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ పదవి లభించింది.

కోడి కత్తులు తయారు చేస్తున్న వ్యక్తి అరెస్టు

కంబాలచెరువు: మంగళవారపు పేటకు చెందిన కోసన బాల వెంకట అర్జునరావును కోడి కత్తులు తయారు చేస్తుండగా మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ డి.నరసింహాకిశోర్ ఆదేశాల మేరకు కోడి కత్తులు తయారు చేసే కేంద్రాలపై పోలీసులు నిఘా పెట్టారు. దీనిలో భాగంగా ఒకటో పట్టణ పోలీసులు.. అర్జునరావును అరెస్టు చేసి, అతడి నుంచి 20 కోడి కత్తులు, వాటిని తయారు చేసే మెషీన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

మాజీ ప్రధాని ఇందిరా గాంధీకి నివాళి



ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని నగరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వై.జంక్షన్ తపోవనంలోని ఆమె విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. మార్టిన్ లూథర్, మోతా శారద తదితరులు పాల్గొన్నారు.

కడియం: కాంగ్రెస్ రూరల్ ఇన్‌చార్జి తాడాల కొండ్రాజు ఆధ్వర్యంలో బుర్రిలంకలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.